News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :31 | ఖమ్మం | శుక్రవారం, మార్చి 21, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## సినీ ప్రముఖులపై బెట్టింగ్
# యాప్‌ల కేసు

- నిందితుల్లో నటులు రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, వైకాపా నేత శ్యామల సహా 25 మంది
- మియాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్
- మరో కేసులో విచారణకు హాజరైన ఇద్దరు యాంకర్లు



నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారం యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి సినీ ప్రముఖుల దాకా వెళ్లింది. గురువారం మియాపూర్ పోలీసుస్టేషన్‌లో నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, వైకాపా అధికార ప్రతినిధి శ్యామలపై కేసు నమోదైంది. వీరితో పాటు బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభాశెట్టి, అమృతాచౌదరి, నయనిపావని, నేహాపఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్, టేస్టీ తేజ, రీతూచౌదరి, బండారు సుప్రీత తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. బీఎన్ఎస్‌లోని 318(4), 112, రెడ్‌విత్ 49, తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఎ), 4 సెక్షన్లు, ఐటీ చట్టం 2000, 2008లోని 66డి సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది. మియాపూర్‌కు చెందిన వ్యాపారి పీఎం ఫణీంద్రశర్మ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు. ఈ నెల 17న పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లోనూ శ్యామల, విష్ణుప్రియ, సుప్రీత, టేస్టీ తేజ, భయ్యా సన్నీయాదవ్, ఇమ్రాన్‌ఖాన్ సహా 11 మందిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

**'భారీగా కమీషన్లు, పారితోషికాలు'**

"చట్టవిరుద్ధ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకు వారు భారీగా కమీషన్, పారితోషికం

వివరాలు 2లో..




## మరో 30 రోజుల్లో గ్రూప్స్
# నియామకాలు

**తెలంగాణకు అద్భుతమైన సాంస్కృతిక వారసత్వం ఉంది. మన ప్రాంతాలను మనం అభివృద్ధి చేసుకోవాలి. సిలికాన్ వ్యాలీయే ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. నిన్ననే మెక్‌డొనాల్డ్స్ కంపెనీ వచ్చింది. -సీఎం రేవంత్‌రెడ్డి**



- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓటమి: సీఎం రేవంత్‌రెడ్డి
- 922 మందికి కారుణ్య, ఉద్యోగ నియామకపత్రాల అందజేత
- 'బిల్డ్‌నౌ పోర్టల్'ను ప్రారంభించిన సీఎం

నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎన్నికల్లో భారాస ఓడిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఉద్యోగాలు ఇవ్వనివారికి ఉద్యోగాలు ఎందుకనే ఉద్దేశంతో ఆ పార్టీని నిరుద్యోగులుఓడించారన్నారు. భారాస ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులు రాష్ట్రానికి గుదిబండగా మారాయని, ప్రతినెలా రూ.10 వేల కోట్ల చొప్పున అసలు, మిత్తి కింద ఇప్పటివరకు రూ.1.53 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారని, దాన్ని 4-5 శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక చెల్లించిన రూ.1.53 లక్షల కోట్లు తమ చేతిలో ఉంటే 75 లక్షల మందికి రుణమాఫీ చేసేవాళ్లమని, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసేవాళ్లమని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.8,000 కోట్లను భారాస పెండింగ్

వివరాలు 2లో..

## వచ్చే సంవత్సరం పాదయాత్ర చేస్తా



- మీడియా ప్రతినిధులతో మాజీ మంత్రి కేటీఆర్
- అధికారం మాత్రమే కోల్పోయాం.. ప్రజల్లో అభిమానం కాదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## నా హృదయం కృతజ్ఞతాభావంతో
# నిండిపోయింది

- యూకే పార్లమెంటులో చిరంజీవికి అపురూప సన్మానం
- లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు అందించిన బ్రిడ్జ్ ఇండియా గ్రూప్
- సోషల్ మీడియాలో చిరంజీవి పోస్టు

వివరాలు 2లో..



## హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై
## ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టివేత

- కేసు నమోదుకు సరైన కారణాల్లేవు
- రాజకీయ శత్రుత్వం కనిపిస్తోంది
- ఫిర్యాదులో అసాధారణ జాప్యం
- కొనసాగింపునకు అనుమతిస్తే న్యాయ ప్రక్రియ దుర్వినియోగమే
- హైకోర్టు తీర్పు






ఫోన్‌ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై కేసులో అభియోగాలకు అనుగుణంగా సరైన

వివరాలు 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు...
# 22 మంది నక్సల్స్ మృతి!

- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో రెండు ఎన్‌కౌంటర్లలో 22 మంది మావోల హతం
- నక్సలైట్ల దాడిలో ఓ జవాను మృతి
- ఘటనాస్థలి నుంచి తుపాకులు, భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

వివరాలు 2లో..



## మరో 15 ఏళ్లు చంద్రబాబే సీఎం...
### ఆయన నాయకత్వంలో పనిచేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే




- విజయవాడలో ఎమ్మెల్యేల క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం
- సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన పవన్ కల్యాణ్
- అభినందనలు తెలిపిన డిప్యూటీ సీఎం
- చంద్రబాబు అనుభవాన్ని పక్కన పెట్టలేమని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## కేటీఆర్‌కు రాజకీయ ఓనమాలు తెలియవు..
## రేవంత్ రెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు


- కేటీఆర్‌కు ఏ అర్హత లేదని, తండ్రి చాటు బిడ్డ అని ఎద్దేవా
- సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఎత్తే అర్హత లేదన్న మంత్రి
- అందరికీ ఫలాలు అందించేలా బడ్జెట్ ఉందన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

వివరాలు 2లో..



## దొంగల్లా వచ్చి.. సంతకాలు చేసి
# వెళ్లిపోతున్నారు

- వైకాపా ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేస్తున్నారు
- దొంగచాటుగా సంతకాలు పెట్టాల్సిన ఖర్మేంటి?
- ఎన్నుకున్న ప్రజలకు తలవంపులు తెచ్చేలా ప్రవర్తించొద్దు
- సభాపతి అయ్యన్నపాత్రుడు ధ్వజం



వైకాపా ఎమ్మెల్యేలు ఎవరికీ కనిపించకుండా దొంగల్లా వచ్చి హాజరుపట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు ధ్వజమెత్తారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండాల్సిన సభ్యులకు ఇలా దొంగచాటుగా సంతకాలు పెట్టాల్సిన ఖర్మ ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. సంతకాలు చేసి సభకు రాకుండా ముఖం చాటేయటం వారి గౌరవాన్ని తగ్గిస్తుందే తప్ప..

వివరాలు 2లో..

# ప్రతి స్కిట్టూ.. సూపర్ హిట్టు


- ఉర్రూతలూగించిన మంత్రులు, ఎమ్మెల్యేల సాంస్కృతిక ప్రదర్శనలు
- ఏకపాత్రాభినయాలు, కామెడీ స్కిట్‌లతో సందడి
- గంటన్నరకు పైగా పడిపడి నవ్విన చంద్రబాబు, పవన్‌కల్యాణ్



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నడూ లేనంత ఆనందంతో నవ్వి నవ్వి.. కుర్చీలోంచి లేచి మరీ చప్పట్లు కొడుతూ సంబరపడ్డారు. ఆ పక్కనే కూర్చున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా నవ్వుతూ ఎన్నోసార్లు లేచి చప్పట్లు కొట్టారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు,

వివరాలు 2లో..

## మూడ్రోజులు వడగండ్ల వానలు..ఆరెంజ్ అలెర్ట్ జారీ




గత కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలకు మరో ప్రమాదం పొంచి ఉంది. రానున్న నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా వడగండ్ల వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఆదిలాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, వరంగల్ జిల్లాల్లో వడగండ్ల వానలు ప్రభావం ఉంటుందని తెలిపింది. శుక్ర శనివారాల్లో ఉరుములు మెరుపులు,ఈదురు గాలులతో కూడిన వడగండ్ల

వివరాలు 2లో..

# వచ్చే సంవత్సరం పాదయాత్ర చేస్తా

ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వచ్చే సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించనున్న పార్టీ 25వ ఆవిర్భావ సభను పురస్కరించుకొని.. సూర్యాపేటలో గురువారం నిర్వహించిన తొలి సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఇంట్లో కొందరు మీడియా ప్రతినిధులు ఆయనతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై భవిష్యత్తులో పాదయాత్ర చేసే అవకాశముందా అని ప్రశ్నించగా.. కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. అంతకుముందు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రాబోయేది భారాస పోరాట నామసంవత్సరమని చెప్పారు. పార్టీ అధికారమే కోల్పోయిందని.. ప్రజల్లో అభిమానం కాదని పేర్కొన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా భారాస అధికారంలోకి రావడం ఖాయమని పునరుద్ఘాటించారు. పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. వేదికపై గుజ్జా దీపిక, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, మల్లయ్యయాదవ్, జగదీశ్‌రెడ్డి, గ్యాదరి కిశోర్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భగత్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు

**ప్రజాసమస్యలపై విజయవంతంగా పోరాటం**

"ఈ 24 ఏళ్లలో 14 ఏళ్లు ఉద్యమ పార్టీగా.. పదేళ్లు అధికార పార్టీగా.. ప్రస్తుతం 15 నెలలు ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై విజయవంతంగా పోరాడుతున్న ఏకైక పార్టీగా భారాస చరిత్ర సృష్టించింది. తెలంగాణ సాధించిన ఘనత అధినేత కేసీఆర్‌దే. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని చూడటం మూర?త్వమే అవుతుంది. రాష్ట్రంలో తిరిగి భారాస అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారం చేపట్టడం ఖాయం. కాంగ్రెస్ పాలన పీడ వదలాలంటే గులాబీ జెండాతోనే సాధ్యం. ముఖ్యమంత్రిని, మంత్రులను నిద్ర పోనివ్వకుండా ప్రజల పక్షాన పోరాడుతున్నాం. ముఖ్యమంత్రికి పర్సంటేజీలపై తప్ప పాలనపై ధ్యాస లేదు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. యూట్యూబర్లను గుడ్డలూడదీసి కొడతాననడం సిగ్గుచేటు.

**పొలాలు ఎండిపోతున్నాయి**

కేసీఆర్‌పై ఉన్న కోపంతోనే రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదు. మేడిగడ్డపై చిన్న నెర్రె పడితే కాళేశ్వరాన్ని మూసివేసి.. గోదావరి నీళ్లను ఆంధ్రకు వదిలేస్తున్నారు. గతంలో ఎస్సారెస్పీ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సూర్యాపేట జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించాం. ప్రస్తుతం ఈ జిల్లాకు చెందిన సాగునీటి మంత్రి ఉన్నప్పటికీ పొలాలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో కేసీఆర్ హయాంలో 36%
నీటిని వాడుకున్నాం. ప్రస్తుతం 24% కూడా వాడుకోలేదు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పుడు చెరువులు నింపుకోవాలన్న అవగాహన లేదు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలను విస్మరించారు. తెలంగాణ రైతులకు అందాల్సిన రుణమాఫీ సొత్తును.. దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలకు సీఎం రేవంత్‌రెడ్డి కప్పం కడుతున్నారు. మొదట రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరం అన్నారు. చివరకు రూ.20 వేల కోట్లని ప్రకటించారు. మిగిలిన సొత్తును రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియాగాంధీ ఖాతాల్లో వేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఏ తప్పూ మాట్లాడకున్నా సస్పెండ్ చేశారు. గౌరవ స్పీకర్‌కు కులాలను ఆపాదించడం సరికాదు. అసెంబ్లీని గాంధీభవన్‌లా నడుపుతున్నారన్న మజ్లిస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకునే ధైర్యం రేవంత్‌కు లేదు. భాజపా నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు సీఎంను కంటికి రెప్పలా కాపాడుతున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు.

# మరో 30 రోజుల్లో గ్రూప్స్ నియామకాలు

- మొదటి పేజీ తరువాయి

పెట్టడంతో వాటిని చెల్లించడం సమస్యగా మారిందన్నారు. అతికష్టమ్మీద ప్రతినెలా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో మరో 30-40 రోజుల్లో గ్రూపు-1, 2, 3లలో 2 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో యాదగిరిగుట్ట దేవస్థానం ఉండగా తితిదేను ప్రతిసారి అడుక్కోవడం ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య, కొత్త నియామకాలకు సంబంధించి 922 మందికి పత్రాలు అందజేశారు. బిల్డ్‌నౌ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

**పదేళ్ల కల సాకారం**

"నియామక పత్రాలు అందుకుంటున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు. మీ కల నిజం కాబోతోంది. ముఖ్యమంత్రి పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించినప్పుడే నాకు ఎక్కువ సంతోషం కలిగింది. తొలి ఉద్యోగం ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగం చేసినంత కాలం గరంగా ఉండాలి తప్ప బేషరం కావద్దు. గత సర్కారు నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. తెలంగాణ సాధనలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడినా తెలంగాణ కోసం అమరులైనవారి ఆశయాలు, నిరుద్యోగుల కలలు నెరవేరలేదు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస పోటీ పరీక్షలను నిర్వహించలేదు. మేం ఏడాదిలోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో నోటిఫికేషన్లు వేయాలని ధర్నాలు చేసేవారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పరీక్షలు వద్దు, వాయిదా వేయండి అంటూ నిరుద్యోగులు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. వాళ్లు చేయలేని పని మేం చేస్తోంటే భారాస నేతలు తట్టుకోలేకపోతున్నారు. తామే నోటిఫికేషన్లు వేశామని, మేం చేసిందేమీ లేదనిమాట్లాడుతున్నారు.

**నాపై ఎందుకుంటుంది కోపం?**

నాపై వ్యతిరేకత, కోపం ఉందని కొందరంటున్నారు. ఎందుకు కోపం? 59 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకా? రైతు రుణమాఫీ చేసినందుకా? మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? వారిని కోటీశ్వరులను చేస్తున్నందుకా? అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలకు సోలార్ విద్యుదుత్పత్తి చేసే అవకాశం కల్పించినందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?

**అందాల పోటీలతో రూ.వందల కోట్ల ఆదాయం..**

మిస్ వరల్డ్ పోటీలపై కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. పర్యాటక రంగానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతోంది. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించబోతున్నారు. 3,000 అంతర్జాతీయ ఛానెళ్లు, పత్రికలు వస్తాయి. మేం దుబారా ఖర్చులు చేయం. ఐదో, పదో కోట్లు ఖర్చు చేస్తే హోటల్, ఫుడ్ ఇండస్ట్రీకి రూ.వందల కోట్ల ఆదాయం వస్తుంది. ఫార్ములా-ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్నవారికి, మాకు పోలికా?

## హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టివేత

- మొదటి పేజీ తరువాయి

కారణాలు లేవని పేర్కొంది. ఫిర్యాదుదారు, హరీశ్‌రావు ఇద్దరూ ఎన్నికల్లో ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేశారని.. ఫిర్యాదులో రాజకీయ శత్రుత్వం కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఫిర్యాదు చేయడంలో అసాధారణ జాప్యానికి కారణాలు పేర్కొనలేదని తెలిపింది. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై కేసు నమోదుకు తగిన కారణాలు లేవంటూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ టి.హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. బలవంతపు దోపిడీకి పాల్పడినట్లుగానీ, పబ్లిక్ సర్వెంట్‌గా విశ్వాసఘాతుకానికి పాల్పడినట్లుగానీ, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిగానీ ఎలాంటి ఆరోపణలు చేయలేదని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## ప్రతి స్కిట్టూ.. సూపర్ హిట్టు

- మొదటి పేజీ తరువాయి

నారా లోకేశ్, పయ్యావుల కేశవ్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు.. పొట్ట చెక్కలయ్యేలా నవ్వి హాస్యాన్ని ఆస్వాదించిన.. అద్భుతమైన సన్నివేశం గురువారం ఆవిష్కృతమైంది. విజయవాడలో గత రెండు రోజులుగా జరిగిన శాసనసభ, మండలి సభ్యుల క్రీడా పోటీల ముగింపు వేడుకలు గురువారం సాయంత్రం నగరంలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి కందుల దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేల సాంస్కృతిక, హాస్య ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. గంటన్నరకు పైగా ఈ ప్రదర్శనలు సాగగా అంతసేపూ చంద్రబాబు సహా అందరూ నవ్వుతూ.. డైలాగ్ డైలాగ్‌కూ చప్పట్ల మోత మోగించారు. ఒక్కో ప్రదర్శన ముగిసిన వెంటనే ఎమ్మెల్యేలను పిలిచి వారితో చంద్రబాబు, పవన్, స్పీకర్ ఫొటోలు దిగారు.

**ఉర్రూతలూగించిన అసందర్భ పాటల ప్రదర్శన**

భాజపా ఎచ్చర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రదర్శించిన 'అసందర్భ పాటల స్కిట్' అదిరింది. 'పాట పాడితే కొడుతున్నారన్నా, మా ఆవిడ ఏకంగా తంతోందన్నా' అని ఈశ్వరరావు, ఎందుకు కొడుతున్నార్రా అని విజయకుమార్ పండించిన హాస్యం పొట్టచెక్కలయ్యేలా నవ్వించింది. రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో జరిగిన పండగలు, పెళ్లి, పుట్టినరోజు వేడుకలు, చావు, దినం భోజనాల వేళ తాను పాట పాడితే కొడుతున్నారని ఈశ్వరరావు చేసిన కామెడీ స్కిట్ సాగుతున్నంతసేపు.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆపకుండా నవ్వుతూనే ఉన్నారు. పెళ్లికి వెళ్లి విషాద గీతాలు, చావుకు వెళ్లి ఆనంద గీతాలు పాడితే కొట్టకుండా ముద్దిస్తారా.. అని విజయకుమార్ అనడం, ఈ స్కిట్ కోసం వీళ్లిద్దరూ ఎంచుకున్న.. రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే, లే లే లే.. లేలేలే నా రాజా' లాంటి పాటలకు ప్రజాప్రతినిధులంతా మనసారా నవ్వుకున్నారు. ఈ స్కిట్ ఇంటికి వెళ్లాక కూడా చాలాకాలం గుర్తొచ్చి నవ్వుకుంటామంటూ పవన్ కల్యాణ్ అనడం విశేషం.

## సినీ ప్రముఖులపై బెట్టింగ్ యాప్‌ల కేసు

- మొదటి పేజీ తరువాయి

తీసుకుంటున్నారు. ఈ యాప్‌ల కారణంగా అప్పులపాలై అనేక మంది ఆత్మహత్యలు చేసుకోగా, చాలా కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఒక దశలో నేను కూడా వీటి ప్రభావానికి గురయ్యా. నా కుటుంబం హెచ్చరికతో ఆగిపోయా. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న వారందరిపై చర్యలు తీసుకోవాలి" అని ఫణీంద్రశర్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**తప్పు చేశానని తెలుసుకున్నా**

**-ప్రకాశ్‌రాజ్**

ఇప్పటివరకూ పోలీసు శాఖ నుంచి తనకు ఎలాంటి సందేశం రాలేదని, వస్తే వారికి వివరణ ఇస్తానని ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్'లో ఓ వీడియో పోస్ట్ చేశారు. "ఆన్‌లైన్ గేమింగ్ యాప్ కేసుల గురించి, నేను చేసిన ఓ ప్రకటన గురించి చర్చ జరుగుతోందని తెలిసింది. అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలి కదా! 2016లో ఆ ప్రకటన నా దగ్గరికి వస్తే చేసిన మాట నిజం. అది తప్పని కొన్ని నెలల్లోనే తెలుసుకున్నా. 2017లో ఆ ఒప్పందం పొడిగిస్తామంటూ మళ్లీ వాళ్లు నా దగ్గరికి వస్తే నేను నటించనని చెప్పా. ఆ తర్వాత ఏ గేమింగ్ యాప్‌కీ ప్రచారకర్తగా పనిచేయలేదు. గేమింగ్ యాప్‌లు ఒక వ్యసనం. యువత వాటికి దూరంగా ఉండాలి" అంటూ చెప్పుకొచ్చారు.

**విచారణకు విష్ణుప్రియ.. రీతూచౌదరి**

యాంకర్లు విష్ణుప్రియ, రీతూచౌదరిలు గురువారం పంజాగుట్ట ఠాణాలో పోలీసుల విచారణకు హాజరయ్యారు. విష్ణుప్రియను 10 గంటలు, రీతూచౌదరిని ఐదున్నర గంటలపాటు పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేయగా ఇప్పటివరకు టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్, విష్ణుప్రియ, రీతూచౌదరి మాత్రమే విచారణకు హాజరయ్యారు.

**చట్టపరమైన అనుమతులు ఉండటంతోనే ప్రచారం**

**-విజయ్ దేవరకొండ, రానా**

బెట్టింగ్ యాప్‌లకు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి ప్రచారకర్తలుగా వ్యవహరించారన్నది అవాస్తవమని, నైపుణ్య ఆధారిత గేమ్‌లకు మాత్రమే ప్రచారం చేశారని వారి పీఆర్‌వో బృందాలు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి. కంపెనీకి, ఉత్పత్తికి చట్టపరమైన అనుమతులు ఉంటేనే వాటికి ప్రచారకర్తగా వ్యవహరించేందుకు ఒప్పుకొంటారన్నారు. ఏ23 అనే కంపెనీతో విజయ్ కుదుర్చుకున్న ఒప్పందం గతేడాదే ముగిసిందని తెలిపారు. అలాగే ఒక కంపెనీతో రానా కుదుర్చుకున్న ఒప్పందం 2017లోనే పూర్తయ్యిందని పేర్కొన్నారు.

## దొంగల్లా వచ్చి.. సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఏ మాత్రమూ పెంచదని పేర్కొన్నారు. ఓట్లేసి ఎన్నుకున్న ప్రజలకు ఆదర్శంగా నిలవాలే కానీ తలవంపులు తెచ్చేలా ప్రవర్తించొద్దని సూచించారు. సభకు హాజరై తమ సమస్యలపై మాట్లాడాలనే ప్రజలు వారిని ఎన్నుకున్నారు తప్ప.. ఎవరికీ కనిపించకుండా హాజరుపట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోవటానికి కాదని అన్నారు. ఇప్పటికైనా వారంతా గౌరవంగా సభకు రావాలని పిలుపునిచ్చారు.

**నాకు కనిపించలేదు.. మీకు కనిపించారా?**

'వైకాపా ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, రేగం మత్స్యలింగం, విరూపాక్ష, మత్స్యరాశ విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, దాసరి సుధ హాజరుపట్టీల్లో సంతకాలు పెట్టినట్లు నా దృష్టికి వచ్చింది. గత నెల 24న గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత నుంచి వీరంతా వేర్వేరు తేదీల్లో సంతకాలు పెట్టారు. వారెవరూ సభలో నాకు కనిపించలేదు. మీకెవరికైనా కనిపించారా?' అని సభాపతి సభ్యుల్ని ప్రశ్నించారు. కర్నూలులో గ్రీన్ కో ప్రాజెక్ట్‌కు సంబంధించి వైకాపా ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, బి.విరూపాక్షిలు లిఖితపూర్వకంగా పంపించిన ప్రశ్న.. ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకొచ్చింది. అయితే ఆ పార్టీ సభ్యులెవరూ సభకు హాజరుకాకపోవటాన్ని ప్రస్తావిస్తూ సభాపతి మాట్లాడారు. 'వైకాపా సభ్యులు లిఖితపూర్వకంగా ప్రశ్నలను సభకు పంపిస్తున్నారే తప్ప.. ఆ ప్రశ్నలు అడగటానికి సభలో ఉండట్లేదు. అసలు వారు సభకే రావట్లేదు. దీని వల్ల ఈ సమావేశాల్లో 25 ప్రశ్నలకు సభలో సమాధానాలు లభించలేదు. అంతేకాకుండా మరికొందరు సభ్యులు ప్రశ్నలు అడిగే, వాటిపై మాట్లాడే అవకాశం కోల్పోతున్నారు. ఇది చాలా దురదృష్టకరం' అని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

**ఎథిక్స్ కమిటీకి పంపిద్దాం**

'వైకాపా సభ్యులు సభకు రాకుండా హాజరుపట్టీలో సంతకాలు పెట్టటం ఒక తప్పయితే.. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటూ సభకు గైర్హాజరవటం మరో తప్పు. జగన్‌మోహన్‌రెడ్డి మినహా వైకాపా సభ్యులందరూ ప్రతి నెలా వేతనాలు తీసుకుంటున్నారు. జీతాలు తీసుకుంటూ డ్యూటీకి రాని వారిని ఏమనాలి?

ప్రభుత్వ ఉద్యోగాలు ఇలాగే విధులకు రాకపోతే వారిని ఏం చేస్తాం?' అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. సస్పెండ్ చేస్తాం.. అంటూ సభ్యులు సమాధానమిచ్చారు. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ వైకాపా సభ్యుల వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి పంపించాలని కోరారు. నిబంధనలన్నీ పరిశీలించి, అనుమతిస్తే ఎథిక్స్ కమిటీకి పంపించి కఠిన చర్యలు తీసుకుందామని అయ్యన్నపాత్రుడు చెప్పారు.

**మీరు రానివ్వలేదోమో అనుకున్నా: సీఎం**

'వైకాపా ఎమ్మెల్యేలు 11 మంది ఫిబ్రవరి 24న సభకు వచ్చినట్లు హాజరుపట్టీలో సంతకాలు పెట్టారు. 25న ఐదుగురు, ఈ నెల 18న ఒకరు, 19న నలుగురు సభకు హాజరైనట్లుగా సంతకాలు చేశారు. సభ లోపల వారెక్కడా కనిపించలేదు. వారిని మీరు రానివ్వలేదోమోనని నా అనుమానం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్వుతూ వ్యాఖ్యానించారు. దానికి సభాపతి స్పందిస్తూ గురువారం మధ్యాహ్నం సభలో మరోసారి మాట్లాడారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు... 22 మంది నక్సల్స్ మృతి!

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. బీజాపూర్, కాంకెర్ జిల్లాలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 22 మంది నక్సల్స్ హతమయ్యారు. మావోల దాడిలో ఓ జవాను మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలు అడవుల్లో గురువారం ఉదయం నుంచే కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోలు ఎదురుపడి కాల్పులు జరిపారు. దాంతో వారిపై భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనాస్థలి నుంచి 18 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు తుపాకులు, భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని, భద్రతా సిబ్బంది వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. అయితే, ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఇదే సమయంలో కాంకెర్ జిల్లాలోనూ మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ బీఎస్ఎఫ్, డీఆర్జీ బలగాలు సంయుక్తంగా జరిపిన కూంబింగ్ ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులను మట్టుబెట్టాయి. ప్రస్తుతం రెండు జిల్లాల్లోనూ యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతుండడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం.

## నా హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోయింది

:యూకే పార్లమెం ట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి ఘన సన్మానం లభించింది. ఎంతో మంది పార్లమెంటు సభ్యులు, మంత్రులు, సహాయ మంత్రులు, దౌత్యవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ ఇండియా బృందం ఆయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. దీనిపై చిరంజీవి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

"ఇంతమంది ప్రముఖుల సమక్షంలో ఈ గౌరవం పొందడం పట్ల నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. వారి నా గురించి చెప్పిన విషయాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. బ్రిడ్జ్ ఇండియా బృందం అందించిన జీవితకాల సాఫల్య పురస్కారం నన్ను ఎంతగానో ఆనందపరిచింది. నా అభిమానులు, రక్తదానంతో నా రక్త సోదరులు, రక్త సోదరీమణులుగా మారిన ప్రతి ఒక్కరికీ, సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, నేను చేపట్టిన మానవతావాద కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గౌరవం నా పనిని మరింత ఉత్సాహంతో కొనసాగించడానికి నన్ను ప్రేరేపిస్తుంది. మీ అందరి అందమైన అభినందన సందేశాలకు ధన్యవాదాలు" అంటూ చిరంజీవి స్పందించారు. అంతేకాదు, తనకు యూకే పార్లమెంటులో జరిగిన సన్మానం తాలూకు ఫొటోలను కూడా చిరంజీవి పంచుకున్నారు.

## కేటీఆర్‌కు రాజకీయ ఓనమాలు తెలియవు..

కేసీఆర్ కొడుకు అని తప్ప కేటీఆర్‌కు రాజకీయ ఓనమాలు కూడా తెలియవని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం అంచెలంచెలుగా ఎదిగారని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్‌కు ఎటువంటి అర్హతలేదని, ఆయన తండ్రి చాటు బిడ్డ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి రైతుబిడ్డగా రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని కొనియాడారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించే
అర్హత కేటీఆర్‌కు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అందరికీ ఫలాలు అందించేలా బడ్జెట్**

తెలంగాణ బడ్జెట్ అందరికీ ప్రయోజనం చేకూరే విధంగా ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, అందులో నల్గొండ జిల్లాకు అగ్రస్థానం ఉందని తెలిపారు. నల్గొండ జిల్లాలో ఈ రబీలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరగడంతో ధాన్యం దిగుబడి పెరిగిందని ఆయన వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులను రెండింతలు పెంచారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో భాగంగా రూ. 11 వేల కోట్ల రూపాయలతో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లలకు ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని వెల్లడించారు. 12,000 కిలోమీటర్ల రోడ్లకు వచ్చే నెల 2వ తేదీన టెండర్లు పిలుస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్త హైకోర్టు భవనం, రూ. 2,700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం జరగనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## మూడ్రోజులు వడగండ్ల వానలు..ఆరెంజ్ అలెర్ట్ జారీ

- మొదటి పేజీ తరువాయి

వానలు కురుస్తాయని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

గురువారం ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో వర్షాలు మెల్లగా ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల పిడుగులు పడ్డాయి. మార్చి 22 నుంచి వర్షాలు ఉరుములతో కూడిన తుపాను వర్షాలు కురుస్తాయి. వచ్చే 2-4గంటల్లో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్‌లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే ఛాన్స్ ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆసిఫాబాద్, జగిత్యాల, సిరిసిల్లలో రాత్రిపూట తుఫానులు ప్రభావం ఉంటుంది. గురువారం రాత్రి తెలంగాణలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుపడే అవకాశం ఉంది. తెలంగాణలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి,ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నలోని ఏకాంత ప్రాంతాల్లో మెరుపులతో కూడిన తుఫాను ప్రభావం ఉంటుంది. శుక్రవారం (మార్చి 21) తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గంటకు 40నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్ల వాన కురిసే అవకాశం ఉంది.నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు గంటలకు 30నుంచి - 40 కి.మీ.వేగంలో వీచే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## మరో 15 ఏళ్లు చంద్రబాబే సీఎం...

రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు మరో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శాసనసభ్యుల క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న పవన్... క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన శాసనసభ్యులను, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. మోషన్ రాజు, రఘురామకృష్ణ రాజులకు, కమిటీ సభ్యులకు, క్రీడా శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు క్రికెట్, టెన్నిస్, షటిల్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన సభ్యులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. పార్టీలకు అతీతంగా, సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. క్రీడా మైదానంలో ఏర్పాట్లు, క్రీడా సామాగ్రి, క్రీడాకారుల సౌకర్యాల కోసం వారు చేసిన కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవాన్ని ఉపయోగించుకుని, ఆయన నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కనీసం 15 ఏళ్లు నిరంతరం కృషి చేయాలని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు అనుభవాన్ని పక్కన పెట్టలేమని, ఆయన నాయకత్వంలో పనిచేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## వడియారంలోనీ ప్రభుత్వ పాఠశాలలో బ్యాగుల పంపిణీ - సాక్షరత మిషన్ భారత్



**మార్చ్ 20 ( సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల్ వడియారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరతా మిషన్, భారత్ సర్కార్ వారి సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నట్లయితే మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య పుస్తకాలు, రాగి జావా, వారానికి మూడు గుడ్లు వంటి సదుపాయాలు మరియు స్కాలర్ షిప్ లు కూడా వస్తాయని, అందుకు తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వసంత, సంతోషిమాత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## టూటౌన్ సీఐ గా బాధ్యతలు స్వీకరించిన యర్రం నాయుడు




**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** విశాఖ టూటౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ గా వీవీసీఎం యర్రం నాయుడు ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి. తిరుమలరావు భీమునిపట్నం లా అండ్ ఆర్డర్ కు బదిలీ కాగా, సిటీ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) నుంచి యర్రం నాయుడు బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ యర్రం నాయుడు మీడియాతో మాట్లాడుతూ ప్రజల రక్షణకోసం నిరంతరం పనిచేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. స్నేహపూర్వకమైన పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యతను ఇస్తామని, ప్రజలంతా సహకరించాలని సీఐ కోరారు. బాధ్యతలు స్వీకరించిన సీఐను సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలను తెలిపారు.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి సీఐ అమ్మినాయుడు



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మ్ట్ దరించాలని లేకుంటే చర్యలు కఠినంగా వుంటాయని ఈస్టు 2 ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు స్పష్టం చేశారు. హెల్మెట్ ధరంచకుండా వాహనాన్ని నడుపుతున్న వారిని గుర్తించి వాహనాలను సీజ్ చేచి పోలీస్ స్టేషన్కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే హెల్మెట్, వాటికి తగిన రికార్డు తీసుకువచ్చి పరిశీలించిన తర్వాత, చలానా విధించి, ఆ వాహనాన్ని అప్ప గిస్తామని చెప్పారు. మంగళవారం రాత్రి 11 వాహనాలను సీజ్ జరిగింది. ప్రతి ద్విచక్ర వాహనదారుడు వెనుక కూర్చున్న వ్యక్తి, ఇద్దరు కూడా హెల్మెట్ ధరించాలని సూచించినట్టు సీఐ అమ్మినాయుడు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ని కలిసిన వశెట్టి శ్యాంకుమార్



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అధికారంలో లేని లోటు ఇక్కడి ప్రజలకు పూర్తిగా అవగతమైందని 38వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు వశెట్టి శ్యాం కుమార్ అన్నారు. ఆసీలమెట్ట కార్యాలయంలో బుధవారం ఉదయం వశెట్టి శ్యామ్ కుమార్ తన బృందంతో వాసుపల్లి గణేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. దక్షిణ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన వాసుపల్లి గణేష్ కుమార్ ఇటు పేదలకు గాని, క్యాడర్కు గాని అండగా ఉండడం ఆయన నైజం అన్నారు. వైసీపీని కానీ వాసుపల్లి గణేష్ కుమార్ ను ఎందుకు దూరం చేసుకున్నామని దక్షిణంలో ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారన్నారు. కనీసం గెలిచిన స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎక్కడ జాడేలేదని దుయ్యబట్టారు. నిత్యం ప్రజల్లో ఉండే వాసుపల్లి గణేష్ కుమార్ ను, మళ్లీ అధికారంలో తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని వసెట్టి శ్యామ్ కుమార్ తెలిపారు. ఎటువంటి త్యాగాలు చేసైన అయినా వైసీపీని మళ్లీ అధికారంలో తీసుకువచ్చి, వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అండగా నిలబడతామని స్పష్టం చేశారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి ఒక మైలురాయి..

● **పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,** నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడాని కి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు.

జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మం ది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టా ఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## విశాఖ స్టేడియానికి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు తొలగింపు పైన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పేడాడ రమణికుమారి



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** విశాఖపట్నం మధురవాడ క్రికెట్ స్టేడియం దగ్గర నిరసన కార్యక్రమం జరిగింది.విశాఖ ప్రగతికి రాచబాటలు వేసిన వైయస్ఆర్ ను కూటమి సర్కారు తీవ్రంగా అవమానించింది.ఈ సందర్భంగా తొలగించిన పేరు యాధావిధిగా పెట్టాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ,నగర మేయర్ హరి వెంకటకుమారి ,విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ,మాజీఎమ్మెల్యేలు,సమన్వయకర్తలు,డిప్యూటీ మేయర్ ,కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు,అనుబంధ విభాగ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు,మహిళా నాయకులు,కార్యకర్తలు,ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు డ్రా చేస్తున్న దొంగ అరెస్టు





**రూ.లక్షా 1,43,000 స్వాధీనం**

**నిందితుడిపై ఇప్పటికే 5 పోలీస్ స్టేషన్లలో కేసులు**

**నిందితుడు వీరయ్య చౌదరి**

**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు విత్ డ్రా చేస్తున్న దొంగను గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోన్-2 క్రైమ్ ఏసీపీ డి. లక్ష్మణరావు వివరాలను వెల్లిడించారు. ఈ ఏడాది జనవరి 18న మింది ప్రాంతా నికి చెందిన దాడి ఆనంద్ సన్యాసి తన భార్య కార్డుతో గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ వద్ద గల ఏటీఎం కేంద్రంలో నగదు డ్రా చేసేందుకు యత్నించారు. ఆ

వివరాలు తెలుపుతున్న జోన్-2 క్రైమ్ ఏసీపీ లక్ష్మణ రావు, చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, తదితరులు సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు వచ్చి సహాయం చేస్తున్నట్టు నటించి సన్యాసి వద్దనున్న కార్డును తీసుకుని మరో కార్డును ఇచ్చాడు. అయితే మళ్లీ అదే నెల 20న నగదు డ్రా చేసేందుకు సన్యాసి ఏటీఎం వద్దకు వెళ్లగా ఆ కార్డు పనిచేయలేదు. దీంతో ఆయన చట్టివానిపాలెంలోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలు డ్రా చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సన్యాసి గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఏటీఎం కార్డును మార్చేసిన మర్రిపాలేనికి చెందిన ముప్ప వీరయ్యచౌదరి (41)ని గాజువాక మోహిని థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్ద అదుపు లోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు పాత నేరస్థుడేనని, ఆయన వద్ద నుంచి రూ.1,43,000, వాచ్ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ లక్ష్మణరావు తెలిపారు. నిందితుడిపై గాజువాక, పెందుర్తి, గోపాల పట్నం, కంచరపాలెం, ఎయిర్పోర్టు పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాస రావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులు వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ.

### చేసిన తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,** యశోద పరివర్తన ఫౌండేషన్ సేవ సమితి నిర్వహణ లో వృద్ధులు, వికలాంగులకు నిత్యవసర వస్తువులు బియ్యం, కందిపప్పు కూరగాయలు తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగులు సంఘం తరుపున పంపిణి చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భూషణ్ రావు మాట్లాడుతూ యశోద ఫౌండేషన్ సేవలను కొని యా డారు వీరు చేస్తున్న సేవలు పేదలకు వికలాంగులకు ఏంతో ఆసరగా ఉంటుందని తెలిపారు. అదే విదంగా డాక్టర్ గోళ్ళ భూపతి రావు మాట్లాడుతు పేదలకు సహాయం చేయటం తమ బాధ్యత గా నిర్వహిస్తామని తెలియచేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కొమరిగిరి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలియ చేసారు. ఇక ముందు కూడా పేదలకు సహయ సహకారాలు అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సుబ్బరాజు, హనుమ%శీ%త రావు, తులసీదాస్, సత్యనారాయణ, మనికుమారి, రాయల రవి మరియు యశోద ఫౌండేషన్ తరపున మేకల లత,అప్పణదాసు, అలవాల రాజా, వాల్మీకి సత్యనారాయణ, జయ బాబు లబ్ధి దారులు పాల్గొన్నారు.




## అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసిన వన్ టౌన్ పోలీస్ సిబ్బంది




**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెల్లి వీదిలో ఒక షాప్ లో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రైడ్ నిర్వహించగా, మద్యం అమ్ముతున్న షాప్ ను గుర్తించి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, 42 మద్యం సీసాలును స్వాధీనం చేసుకొవడమైనది. డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పీ.ఎస్., కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఒకటవ పట్టణ పోలీసులను అభినందించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.భద్రాచలం పట్టణంకి చెందిన వారు ఆరోగ్యం బాగోలేక ప్రైవేట్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ పొంది వాటికి సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ కి అప్లై చేయగా వారికి చెక్కులు రావడం జరిగింది. అట్టి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా సంబంధిత వారికి 60,000/- అందజేసారు. లంక నాగేశ్వరరావు చర్ల మండలం ఆర్ కొత్తగూడెం గ్రామం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం





- మాదిగ మాదిగ ఉపకులాల చిరకాల డిమాండ్ ను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్

సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్) మార్చి 20:దశబ్దాలుగా సుదీర్ఘమైన డిమాండ్లను పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్ అన్నారు.గురువారం చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎస్సీ సెల్ బ్లాక్,మండల కమిటీ అధ్యక్షులు ఊదరి నరసింహ ,ఊదరి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణనను అసెంబ్లీలో ఆమోదం తెలిపిన మంత్రి వర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి కి, మంత్రి దామోదర రాజనర్సింహ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ మాదిగ జాతి సోదరుల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ ఒకవైపు, బీసీలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు బీసీ కులగణన మరోవైపు నిర్వహించి.. సామా జిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువు చేసిందన్నారు. ఎస్సీ వర్గీ కరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించగానే తెలంగాణ ప్రభుత్వం ఏక సభ్య కమీషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయించి అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని వివరిం చారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందుకు తగినట్లుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటూ బలహీనవర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.. అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఊదరి నరసింహ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊదరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు ఊదరి నరసింహ, గుడ్డేటి యాదయ్య ,బక్క శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊదరి వెంకటేష్ మహాజన్, బర్రె నరసింహ,ఎర్రగుంట వెంకటేష్, కొమ్ము లక్ష్మయ్య, బండమీది వెంకటేష్ ,బండమీది ఎల్లయ్య, ఊదరి రమేష్, ఎర్ర శంకర్,ఊదరి శంకర్, మాదాని గోపాల్, పస్తం గంగారాములు, గుడ్డేటి దశరథ, బోయ వెంకట్, బోయ ఆనంద్ ,బోయ అరవింద్, బోయ సంపత్, తూర్పుంటి వంశీ,దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- నిరుద్యోగ సమస్య పై,మతోన్మాద పాసిస్ట్ విధానాలకి వ్యతిరేకంగా పోరాడుదాం
- పి వై ఎల్ టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి సతీష్,




సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి ,మార్చి 20, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి, నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా,పరాయి పాలనను ఎదిరిస్తూ నవ యవ్వన ప్రాయం లోనే దేశ స్వాతంత్ర%శీ%, సమానత్వం కోసం నవ్వుతు ఉరికంభం ఎక్కి ఉరితాడును ముద్దాడి తమ అమూల్యమైన ప్రాణాలని తృణా ప్రాయంగా దేశం కోసం అర్పించిన విప్లవకారులు భగత్ సింగ్, రాజగురు, సుఖ దేవ్ ల 94 వ వర్ధంతి సందర్భంగా టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో విస్తృతంగా సభలు, కాగడాల ప్రదర్శనలు నిర్వహించాలని యువతరానికి పిలుపునిచ్చారు.

ప్రగతిశీల యువజన సంఘం టేకులపల్లి మండల కమిటీ సమావేశం కొడెం. రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి. సతీష్, మాట్లాడుతూ పి వై ఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శనలు, గ్రూప్, కార్నర్ మీటింగ్ లు నిర్వహించాలని తెలిపారు. మార్చి 23వ తేదీన టేకులపల్లి లో భగత్ సింగ్, రాజ్ గురువు, సుఖ దేవ్ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్నామని యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నేడు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల మధ్య కులమతాల పేరుతో మంటలు రాజేస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసి అశాంతి నెలకొల్పడానికి కుట్రలు చేస్తుందని, మణిపూర్ రాష్ట్ర%శీ%లో మతం పేరుతో మంటలు పెట్టి రాష్టాన్ని రావణ కాష్టం గా మార్చివేసిందని విమర్శించారు. ఒక సంవత్సర కాలంలో కోటి ఉద్యోగ అవకాశలు కల్పిస్తామని చెప్పి నేడు ఉన్న ఉద్యోగానికి రక్షణ లేకుండా చేసిందని, ఉద్యోగం రాక నిరుద్యోగులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని, నిరుద్యోగుల సమస్యను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆవేదన చెందారు. దేశ ప్రగతిలో యువతని భాగస్వామ్యం చేసుకోవలసిన పాలక ప్రభుత్వాలు,నేడు డ్రగ్స్, పబ్స్,గంజాయి, మత్తు పదర్థాలతో యువ శక్తిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. పెట్టుబడి దేశాల ఆధిపత్య పోరాటం లో భాగంగా మూడవ ప్రపంచం యుద్ధం వచ్చే సూచనలు ఉన్నాయని, కొత్తగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత నిరుద్యోగ యువతని లక్ష్యం చేసుకొని సంకెళ్లు వేసి దేశానికి తీసుకొచ్చి వదిలేస్తుంటే భారత ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నాడో యువత ఆలోచన చేయాలనీ కోరారు. భగత్ సింగ్, రాజగురు, సుఖ దేవ్ ఇచ్చిన స్ఫూర్తితో పోరాడాలని యువతరానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి వై ఎల్ టేకులపల్లి మండల నాయకులు భూక్య. లక్ష్మణ్, పూనేం. సమ్మయ్య, జార్జి, రామ, గవాస్కర్, బాబు లాల్, బాలాజీ, రమేష్, కొటేష్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ను సన్మానించిన సిపిఐ నాయకులు







వేములపల్లి సికె న్యూస్ మార్చ్ 20 : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగ ఏకగ్రీవంగ ఎన్నికైన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంని మరియు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట రెడ్డిని వేములపల్లి మండల సిపిఐ నాయకులు గురువారం కలిసి వారికీ సన్మానం చేయదం జరిగింది ఈ సన్మానం కార్యక్రమంలో సీపీఐ మండలకార్యదర్శి జిల్లా యాదగిరి,మద్దిరాల వెంకటరెడ్డి, మున్నయ్య,బోస్క పరమేష్,పెదపంగ ఆనందం,పాల్వాయి సుధాకర్,చల్లా వెంకన్న,జడ వీరయ్య,పరశురాం,జడ బీమయ్య పాల్గొనడం జరిగింది

## పదవ తరగతి విద్యార్థులు ఆల్ ద బెస్ట్

### చందాయి పేట మాజీ సర్పంచ్



మార్చ్ 20 ( సీ కే న్యూస్) చేగుంట :అల్ ది బెస్ట,ఆత్మవిశ్వాసం తో పరీక్ష వ్రాయండి...

మీరు చదువుకున్న పాఠశాల చందాయిపేట కు, చేగుంట మండలం కు మెదక్ జిల్లా కు మంచి పేరు తేవాలి.

ఉపాధ్యాయుల కృషి ని మీ అమ్మ నాన్న ల ఆశయాలు నెరవేర్చండి..

పది, ఫలితాల్లో అగ్రస్థానాన్ని నిలబెట్టాలి

- 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు శుభాశీస్సులు...

%-% బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ తాజా మాజీ సర్పంచ్...

రేపటి నుండి ప్రారంభం అయ్యే పదవతరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థిని,విద్యార్థులకు మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ శుభాశీస్సులు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలాల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆశిస్తున్నా. మీరు కూడా కష్ట పడి చదివారు..మీ కష్టం వృధా కాదు... మీ భవిష్యత్తు పునాది పదవ తరగతే అని... ఇష్టపడి... ఆత్మవిశ్వాసం తో పరీక్షలు వ్రాయండి... ఉత్తమ ఫలితాలు సాధించి మెదక్ జిల్లా100శాతం ఉత్తిర్ణత సాధించాలని ఆకాంక్షించారు.మీ అమ్మ నాన్నల ఆశయాలను నెరవేరుస్తారని ఆశిస్తున్నాను. మీరు విజేతలుగా నిలవాలని నా మనసారా కోరుకుంటున్నాను. వాటికి మీ నుంచి, మీ తల్లిదండ్రుల నుంచి మీరు మంచి ఉత్తిర్ణత మంచి మార్కులు సాధించిన వారికి బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడంలో మన జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. గతంలో ఈ స్థానాన్ని నిలబెట్టుకొని ముందు తరాలకు ఆదర్శంగా నిలవాలి. మీరంతా ఏకాగ్రత తో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని కోరుతూ శుభాశీస్సులు. అల్ ది బెస్ట్

## అగ్ని ప్రమాద బాధితులకు లైన్స్ క్లబ్ చేయూత....!



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 20,భద్రాచలం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కూలిపోయిన ఎట్ట పాక మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ధారా వెంకటేశ్వర్లు కాటూరి నరసమ్మ కుటుంబాలకు లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో నక్క వెంకన్న సిద్ధారెడ్డి ల సౌజన్యంతో నిత్యవసర వస్తువులను గురువారం అందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షులు చిట్టినీడు రామలింగేశ్వర రావు మాట్లాడుతూ తోటపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై రెండు పూరీలు పూర్తిగా దగ్ధం అయిపోవడంతో ఆ రెండు కుటుంబాలు నిస్సహాయ స్థితికి చేరుకున్నాయని అన్నారు. సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ప్రముఖులైన నక్క వెంకన్న సిద్ధారెడ్డిలు వెంటనే స్పందించి రెండు కుటుంబాలకు సరిపోయే నిత్యవసర వస్తువులను లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో అందించడం అభినందినీయమని అన్నారు. ఆపదలో ఉన్న తోటి వారికి సహాయం చేయడమే లైన్స్ క్లబ్ యొక్క ప్రధాన లక్ష్మణ్ దానికి అనుగుణంగానే అవసరం ఉన్న వరకు సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొనగా నక్క వెంకన్న సిద్ధారెడ్డి చేతుల మీదుగా బాధితులకు కిట్లను అందించారు.

## దశ దిన కర్మ కు హాజరైన బి యస్ పి పార్టీ డోర్నకల్ నియోజక వర్గ ఇన్చార్జి పార్వతి రమేష్ నాయక్



సి కె న్యూస్ ప్రతినిధి:బహుజన్ సమాజ్ పార్టీ డోర్నకల్ నియోజక వర్గ ఇన్చార్జి పార్వతి రమేష్ నాయక్ అనెపురం రెవెన్యూ గ్రామ పంచాయతీ యలమంచిలి తండా లో ఇటీవల స్వర్గస్థులు అయిన బాణోత్ లాలమ్మ దశ దిన కర్మ కు హాజరు అయి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం వారి చిత్ర పటానికి పూల దండ వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబానికి సద్గురువు సేవాలాల్ మహారాజ్ మరియు సప్త భవాని మాతల మనో ధైర్యం ప్రసాదించాలి అని కోరారు.

ఈ కార్య క్రమం లో లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్, బహుజన్ సమాజ్ పార్టీ మరిపెడ మండల సెక్రటరీ గుగులోత్ మోహన్ నాయక్ , తండా నాయకులు భీమా నాయక్,సిరి నాయక్, లాలు నాయక్ , కీరు నాయక్,చందు నాయక్, రామ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి సహాయం అందజేత, కాంగ్రెస్ మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు



మార్చ్ 20 ( సికే న్యూస్) చేగుంట :చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన. ఎర్ర.చంద్రం స్వామి తల్లి గారైన ఎర్ర పోచమ్మ కుటుంబానికి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చౌదరి శ్రీనివాస్ 50 కిలోల బియ్యం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెదరమైన స్వామి, దేవరాజ్, కొమ్ము ఎల్లం, ఎండి అప్సర్, ఎగ్గడి ఇస్తార్, ఎగ్గడి బాబు, మొయ్యబాబు, ఎర్ర ముత్తయ్య, కొమ్ము నందు ఎగ్గడి భరత్ ఎగ్గడి ఎల్లం, మొయ్యలాలు, మోడమైన స్వామి, భూపాల్, లాలు, తదితరులు పాల్గొన్నారు

## మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగించాలి. సీపీఎం మండల కార్యదర్శి పాదూరు శశిధర్ రెడ్డి



సీకే న్యూస్ వేములపల్లి మార్చి 20 :వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సందర్భంగా వేములపల్లి మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పాదూరు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం గారు భూమి కోసం భుక్తి కోసం వ్యక్తి చాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలన పైన వీరోచిత మైన పోరాటాలు కొనసాగించారని తెలిపారు.నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులుగా చేసి,గడీల పైన దాడులు చేసి ధాన్యాన్ని పేదలకు పంచిపెట్టిన ఘనత స్వరాజ్యం గారిది అని అన్నారు.ఆమె వీరోచిత పోరాటాన్ని తట్టుకోలేని నిజాం సర్కార్ ఆమెను పట్టిస్తే పదివేల రూపాయల నజరానా అప్పట్లోనే ప్రకటించారంటే ఆమె పోరాటం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు.ఆమె నిజాం,రజాకార్ల పాలిట సింహ స్వప్న పై దున్నేవాడికి భూమి దక్కాలని వీరోచిత పోరాటం చేసిందని గుర్తు చేశారు.ఆమె త్యాగాలు ఇప్పుడు ఉన్న ప్రజలందరూ గుర్తుపెట్టుకోవాలని ఆమె ఆశయ సాధన బాటలో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి,పోలబోయిన వరలక్ష్మి,రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రాంరెడ్డి,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చల్లబట్ల ప్రణీత్ రెడ్డి, మండల నాయకులు వడ్డగాని సైదులు,మద్దిరాల సత్తిరెడ్డి రెమడాల బిక్షం,కోడిరెక్క వెంకన్న,కందుల నాగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సుకన్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి వారి 42 రోజులు హుండీ లెక్కింపు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),మార్చ్ 20, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం రామాలయం లో దక్షిణ అయోధ్య గా పేరుగాంచిన శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు.

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి 42 రోజులు హుండీ ఆదాయం 1,14,60,041.00 రూపాయల నగదు, బంగారం 133 గ్రాములు, వెండి 1262 గ్రాములు, కెనడా 50 డాలర్స్, యుఎస్ 293 డాలర్స్, సింగపూర్ 7 డాలర్స్, 10 యూరోస్, బ్యాంక్ ఆఫ్ మలేషియా 50 రింగ్ ఇట్స్, చైనా 5 యువన్, కతర్ 2 రియట్, సౌదీ అరేబియన్ 1 రియల్, నేపాల్ 5 రూపీస్, 10 దిర్హామ్స్ హుండీ ఆదాయంగా వచ్చిందని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు.

# 25,26,27 తేదీలలో ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర5వ మహాసభలు.

- రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదు
- పెండింగ్ ఫీజు రీయంబర్స్ %డ%స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి
- ఓయూలో అప్రజాస్వామిక సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి.పోరాడుతున్న వారి అక్రమ అరెస్టులు దుర్మార్గపు చర్య
- విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు




**సి కె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం:** భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర 5వ మహాసభలు ఎప్రిల్ 25,26,27 తేదీలలో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు.

స్థానిక సుందరయ్య భవన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు పి.సుధాకర్, తుడుం ప్రవీణ్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టి.నాగరాజు మాట్లాడుతూ 20ఏండ్ల తర్వాత ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరుపుతున్నామని ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర విద్యారంగ సమస్యలు పరిష్కారానికి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు,10 యూనివర్శిటీల నుండి ఎంపిక చేసిన 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు అని తెలిపారు.

అలాగే రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రవేశ పెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని 23,108 కోట్లు కేటాయింపు చేసినది అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు యేమాత్రం సరిపోవని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లో గతం కంటే 0.2% మాత్రమే పెంచారని ,ఉస్మానియా, కాకతీయ, జెఎన్టీయుహెచ్ లాంటి యూనివర్శిటీలకు నిధులు లేవని తెలిపారు.

రాష్ట్రంలో గత 6 యేండ్లు నుండి పెండింగ్ స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ 8,258 కోట్లు పెండింగ్ ఉన్నాయని వాటిని విడుదల చేయకుండా, కనీసం ప్రస్థావించకుండా బడ్జెట్ పెట్టారని తెలిపారు.


ఉస్మానియా యూనివర్శిటీలో సర్క్యులర్ పేరుతో నియంతృత్వ విధానాలు,అప్రజాస్వామిక చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాడుతున్న విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గం అని తెలిపారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూములను కార్పోరేట్ శక్తులను అప్పజెప్పే చర్యలను వెనక్కి తీసుకొవాలని డిమాండ్ చేశారు.

ఈ ప్రెస్ మీట్లో జిల్లా నాయకులు వినోద్, పూజిత, మనోజ్, త్రినాథ్, లోకేష్ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం -గతిశక్తి కింద తెలంగాణలో నిర్మించిన ఎక్స్ప్రెస్ వే ల వివరాలేంటి..?

- ప్రాజెక్టుల వేగవంతానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి
- సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**సి కె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం:** ప్రధానమంత్రి – గతిశక్తి పథకం కింద దేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఎక్స్ ప్రెస్ వే జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి వివరాలు తెలపాల్సిందిగా, అలాగే ప్రాజెక్టుల వేగిరానికి చేపడుతున్న చర్యల గురించి ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి గురువారం లోక్ సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖల మంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.జాతీయ ఎక్స్ప్రెస్ వే లతో సహ జాతీయ రహదారు (ఎన్ హెచ్)ల అభివృద్ధి, నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తోందని అన్నారు. యాక్సెస్–నియంత్రిత హై స్పీడ్ కారిడార్లు (హెచ్ ఎస్ సీ ) సహ అన్ని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులు పీఎం– గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ( ఎన్ఎంపీ ) సూత్రాలకు అనుగుణంగా ప్రణాళిక చేయబడ్డాయన్నారు.సుమారు 2,474 కి.మీ పొడవులో జాతీయ హెచ్ఎస్సిలు / ఎక్స్ప్రెస్ వే లు అమలు చేయబడ్డాయని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో 779 కి.మీ పొడవులో నాలుగు నేషనల్ హెచ్ఎస్సీ ఎక్స్ప్రెస్ వే లు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ – విశాఖపట్నం, షోలాపూర్ – కర్నూల్ – చెన్నై, ఇండోర్– హైదరాబాద్ మరియు నాగ్పూర్– విజయవాడ కారిడార్లకు సంబంధించి 415 కి.మీ పొడవు నిర్మించబడినట్లు వివరించారు.తెలంగాణ రాష్ట్రంతో సహ దేశంలోని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు పీఏఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ పోర్టల్లో ప్రాజెక్ట్ నివేదిక, ప్రణాళిక పొందుపరుస్తున్నామని, ల్యాండ్ అక్విజిషన్, పర్యావరణ అనుమతులను పాటిస్తూ, అవసరమైన చోట రైల్వే సరళీకృత విధానం అమలు చేస్తూ..కాంట్రాక్టర్ సకాలంలో పూర్తిచేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.ఆత్మనిర్భర్ భారత్ ద్వారా నిబంధనలు సడలిస్తూ.. ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి అయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు.

# పదవ తరగతి గిరిజన విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చి 20,**గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులు మనసులో ఎటువంటి భయాందోళనలు పెట్టుకోకుండా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఏకాగ్రతతో మనసు పెట్టి ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలు బాగా రాసి, ఏ గ్రేడ్ లో పాస్ కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు మంచిగా రాస్తే మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మనస్ఫూర్తిగా బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. శుక్రవారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విషెస్ తెలియజేస్తూ, ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే ఈ పరీక్షలు మీరు ప్రశాంతంగా వ్రాసేందుకు సంబంధిత హెచ్ఎం, ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురి కావద్దని, భయపడవద్దని, నిర్భయంగా ధైర్యంగా పరీక్షలు రాయాలని, ఈ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో మీ ఉజ్వల భవిష్యత్తుకు ఆధారపడి ఉంటుందని, విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధిస్తారని, పరీక్షల్లో విజయం సాధించడానికి ప్రణాళికబద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు స్పష్టంగా సమాధానాలు రాయాలని, మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు 55, వసతిగృహాలు 21, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు 03, మొత్తం 79 ఇన్స్టిట్యూషన్లలో 2665 మంది 10వ తరగతి గిరిజన విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని ఇందులో బాలురు 1423, బాలికలు 1242 కలిపి 2665 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతున్నారని, అందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరవేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పిల్లల వెంట పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి ఎంతో ప్రతిష్టాత్మకమైన పరీక్షల్ని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని, పరీక్షలు జరుగు సమయంలో వైద్య సిబ్బంది ప్రతి పరీక్షా కేంద్రంలో అందుబాటు లో ఉండాలని, పారిశుద్ధ్యం, త్రాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం,తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థిని విద్యార్థులు అస్వస్థతకు గురి అయితే తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించి ఐటిడీఏ కు మంచి పేరు తేవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పిల్లలందరూ ఎటువంటి భయం లేకుండా, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పరీక్షలు బాగా రాసి నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోని ఐటీడీఏల కంటే భద్రాచలం ఐటీడీఏ లోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలపాలని ఆయన తెలుపుతూ పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థుల కు మనస్ఫూర్తిగా దీవిస్తున్నానని ఆయన తెలిపారు.

# పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్ భాస్కర్ ఏకగ్రీవ ఎన్నిక





**పలమనేరు, మార్చి 20, సీకే న్యూస్:** పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

న్యాయవాద వృత్తిలో 26 సంవత్సరాలుగా రాణిస్తున్న....ఎల్ భాస్కర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక కావడం పట్ల ఆప్తులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

ఏజీపీగా నాలుగు సంవత్సరాలు సేవలందించి, నోటరీగా సేవలందిస్తున్న భాస్కర్.

విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు పు ణికి పుచ్చుకొని 92బ93 సంవత్సరాలలో డిగ్రీ కాలేజ్ చైర్మన్గా ఎన్నుకోబడ్డారు.

టిడిపి లీగల్ సెల్ చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధిగా, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా, అటు న్యాయవాద వృత్తిలోనూ....ఇటు సేవా రంగంలో విశేష సేవలు చేసిన, చేస్తున్న...ఎల్ భాస్కర్.

ఈరోజు జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో, ఏకగ్రీవంగా ఎల్ భాస్కర్ ఎన్నిక కావడం పట్ల తోటి న్యాయవాదులు శ్రేయోభిలాషులు అభినందనలతో ముంచెత్తారు.

పలమనేర్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కే.లక్ష్మీపతి అధ్యక్షుడిగా ...ఎల్ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ గా వి చంద్రశేఖర్, షరీఫ్.జనరల్ సెక్రెటరీగా బి బర్కత్, జాయింట్ సెక్రటరీగా జి ఆర్ రవి ట్రెజరర్ గా ఫామిద్ భాష, లైబ్రేరియన్ గా ఇబ్రహీం, లేడీ రిప్రజెంటేటివ్ గా మహేశ్వరి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రంజిత్ షా ను ఎన్నుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తెలియజేశారు

ఈ కార్యక్రమంలో సీనియర్ మరియు జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం బస్ స్టాండ్ కు మరమ్మత్తులు చేపట్టాలి.

**బస్టాండ్ ముందు న్యూడెమోక్రసీ ధర్నా.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉన్న కొత్తగూడెం బస్టాండ్ కు మరమ్మత్తులు చేపట్టాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బస్టాండ్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగూడెం బస్టాండు పాతకాలం నాటిదని ఇది స్థితిలో వస్తాకు చేరుకొని వర్షం వస్తే కురుస్తుంది కింద మొత్తం ఫ్లోరింగ్ పగిలిపోయి కూర్చోడాని కి వీలు లేకుండా ఉన్నదని జిల్లా కేంద్రం కావడంతో బస్టాండ్ విస్తీర్ణం కూడా పెంచాలని కొద్ది ప్లేసులలో ఆ హెూటల్ లో పార్కింగ్ ల వల్ల బస్సులకు ఇబ్బంది కలుగుతుందని ప్రయాణికులు గురవుతున్నారని ప్రయాణికులు కూర్చోవడానికి బల్లాలు కూడా సరిపోవడం లేదని మంచినీటి సౌకర్యం కూడా లేదని వేలమంది రోజు వచ్చి పోతుంటే నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని అంతేకాకుండా ఏమైనా కొందామంటే బస్టాండ్ లో ఎక్కువ ధరతో అమ్ముతున్నారని ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రమైన బస్టాండ్ కు నిధులు కేటాయించి కొత్తగా మరమ్మతులు చేపట్టాలని హెూటల్ పార్కింగ్ ప్లేస్ ని తీసివేయాలని వారి డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకురాలు బూరుగడ్డ వెంకటమ్మ, ఐ ఎఫ్ టీ యు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంజీవ్,కోశాదీకారి మోత్కూరి మల్లికార్జున రావు, ఐ ఎఫ్ టీ యు జిల్లా నాయకులు వి.సురేష్,పి డి ఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.శ్యామ్,ప్రణయ్ కుమార్ వివిధ ప్రజాసంఘాల నాయకులు ఏ వెంకన్న, బ్రహ్మానందం, లింగయ్య, రఘు, జస్వంత్, సిద్ధార్థ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.




# రేషన్ కార్డ్ లేకపోవడంతో అర్హత కోల్పోతున్న యువత....

- ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలు మార్చాలి....
- బుర్గంపహాడ్ మండల జనసేన పార్టీ నాయకులు : గోవిందు వెంకటేశ్వరరావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,**గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడం తో 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతూ వచ్చారు.కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉండడంతో పలువురు యువకులు డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులో డిలీట్ అయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొని వచ్చింది.ఎంతో ఆశగా శిక్షణతో పాటుగా సబ్సిడీ రుణాలు లభిస్తాయని ఉపాధి పొందవచ్చు అని ఆశతో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి ఈ సేవా సెంటర్లకు వెళ్తే అక్కడ నిర్వాహకులు వివరాలు నమోదు చేసే క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి ఇంతకు ముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ఆ నెంబర్ కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని చెప్పడంతో యువకలు చాలా మంది నిరుత్సాహ పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జనసేన బుర్గంపహాడ్ మండల నాయకులు గోవిందు వెంకటేశ్వరరావు కోరుతున్నారు.

# చంచలగూడ కారాగారం ఉన్న ముద్దాయి అనారోగ్యంతో మృతి.

- పోడియం మల్లేష్, భద్రాచలం, ఆచూకీ తెలిసిన వాడు సంప్రదించగలరు....
- చంచలగూడ కారాగారం జైలర్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,చంచలగూడ కారాగారం హైదరాబాద్ నందు శిక్ష ముద్దాయిగా ఉన్న ధనసరి మల్లేష్ అలియాస్ పోడియం మల్లేష్ తండ్రి పేరు వీరాస్వామి గ్రా: కుప్పతొట్టి, కురునూరు పంచాయత్, కలిమెల మండలం, మల్కన్గిరి జిల్లా, ఒడిసా రాష్ట్రం మరియు ప్రస్తుత చిరునామా అశోక్ నగర్ కాలనీ, భద్రాచలం టౌన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాస్తవ్యుడైన ఇతడు గంజాయి కేసు నందు శిక్ష పడి ఖమ్మం జిల్లా నుండి చంచలగూడ కారాగారం నకు తేది 02.12.2021 రోజున బదిలీ చేయబడినాడు, తదుపరి ఇతడి ఆరోగ్య పరిస్థితి సరిగా లేని కారణంగా తేది 22.01.2025 రోజున గాంధీ హాస్పిటల్ హైదరాబాద్ నకు పంపగా ఆ రోజు నుండి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు, తేదీ 19.03.2025 రోజున సాయంత్రం 7.35 గంటలకు అతడు మృతి చెందినట్లు గాంధీ హాస్పిటల్ నుండి కేంద్ర కారాగారమునకు సమాచారం అందించారు. అతడి కుటుంబ సభ్యులకి మరియు బంధువులకి సమాచారం ఇచ్చుటకు ప్రయత్నం చేసిన కూడా ఎలాంటి ఫలితం లేదు, అందువలన ధనసరి మల్లేష్ అలియాస్ పోడియం మల్లేష్ తండ్రి పేరు వీరాస్వామి అశోక్ నగర్ కాలనీ, భద్రాచలం టౌన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇతడికి సంబందించిన కుటుంబ సభ్యులు కానీ లేదా బంధువులు కానీ ఎవరైనా ఉంటె ఈ ఫోన్ నెంబర్ లకు సంప్రదించగలరు చంచలగూడ కారాగారం జైలర్ (7095888604), డబీర్పూర ఇన్స్పెక్టర్ (8712660360), డబీర్పూర సబ్ ఇన్స్పెక్టర్ (8712660354), ఒకవేళ 48 గంటల లోపు ఎవరు కూడా సంప్రదించని యెడల అతడి మృతదేహాన్ని మున్సిపాలిటీ వారికీ అతడి అంత్యక్రియల నిమిత్తం అప్పచెప్పడం జరుగుతుందని తెలపడమైనది.

# వన్ నేషన్, వన్ ఎలక్షన్, జయంతి ఉత్సవాలు దిగ్విజయం చేయాలి,

- అటల్ బిహారీ వాజ్పేయి జయంతి.
- బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 20.భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ గారి ఆధ్వర్యంలో వన్ నేషన్ - వన్ ఎలక్షన్, మరియు శ్రీ మాన్య అటల్ బిహారీ వాజ్పేయి గారి శతజయంతి ఉత్సవాల సంబంధించి వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి గారు హాజరు కావడం జరిగింది. వారు మాట్లాడుతూ దేశంలో ఒకేసారి అన్ని ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజల పైన చాలా ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చు అని, అదేవిధంగా ప్రభుత్వాలు ప్రజలకు అందించే సంక్షేమ ఫలాలు ఎలాంటి అవరోధాలు లేకుండా అందించవచ్చని వారు తెలియజేయడం జరిగింది. ఈ అంశాలను అందరు కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో చర్చగోష్టులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాల్సిందిగా తెలియజేశారు. అదేవిధంగా మాజీ ప్రధాని మాన్యశ్రీ అటల్ బిహారీ వాజ్పేయి గారి శతాజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. వాజ్పేయి గారు చేసినటువంటి సేవలను ప్రజలకు తెలియజేసి, వారి పైన కళారూపాలను రూపొందించి జిల్లాలో జరిగే వర్క్ షాప్ లో ప్రదర్శించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అటల్ శతజయంతి జిల్లా కన్వీనర్ కొప్పుల యాదిరెడ్డి, వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కో కన్వీనర్ మంద నరసింహ, అటల్ శతజయంతి మండల కన్వీనర్ లోడే లింగస్వామి, మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చ గిరి జిల్లా నాయకులు కందుల తానేష ,బచ్చు శ్రీనివాస్, మండల నాయకులు డోగి పర్తి సంతోష్, అప్పిశెట్టి సంతోష్, ఎదురుగట్ల వెంకటేశం, మందుల నాగరాజు, యువమోర్చా నాయకులు బుంగమట్లమహేష్, రే గురి అమరేందర్ ఆమనగంటిశివకుమార్, మోర్చాల అధ్యక్షులు పల్లెర్ల నరసింహ, కొత్త రామచంద్ర యాదవ్, పాతకోట నరేష్, జంగయ్య ,నాగేల్లి పాండు, కీర్తి వెంకటేశం, రావుల పద్మారెడ్డి తదితర కార్యకర్త బంధువులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ పెంపు పై హర్షం

**బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి.**

సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 20. వలిగొండ మండల కేంద్రంలో బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో.

స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలిసి బిసి రిజర్వేషన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీ బిల్లు పై సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంటనే ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకోవడం జరిగింది,ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పబ్బు ఉపేందర్ బోస్ మాజీ ఎంపీపీ నూతన రమేష్ రాజు మార్కెట్ డైరెక్టర్ దానయ్య బత్తిని లింగయ్య రాచమల్ల తిరుపతయ్య పబ్బు సురేందర్ కంకల కిష్టయ్య బత్తిని సహదేవ్ ఏమే లింగస్వామి బత్తిని రవి మాజీ ఎంపిటిసి మల్లేశం చిత్తాపురం నరసింహ



యువజన సంఘం నాయకులు బత్తిని చిన్న నాగేష్ బీసీ నాయకులు బుడిగె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తినిచ్చే తెలంగాణా రాష్ట్ర బడ్జెట్



రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

బుధవారం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై కొత్వాల స్పందిస్తూ తెలంగాణా రాష్ట్రంలో గట్టు ఆర్థిక పరిస్థితులు వున్నప్పటికీ, వాటిని అధికమించే విధంగా 3,04,965 కోట్ల ప్రణాళికతో బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. బడ్జెట్ మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, ఎస్ సీ, ఎస్ టి, బి సీ, మైనార్టీలకు లబ్ది చేకూరేలా ప్రవేశ పెట్టారని కొత్వాల అన్నారు.

వ్యవసాయ రంగాని కి, రైతు భరోసాకు, నీటిపారుదల శాఖలకు పెద్దపీట వేసి రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి వున్నా చిత్తశుద్ధిని తెలిపింది అని కొత్వాల తెలిపారు

# సింగరేణి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,హైదరాబాద్ కు చెందిన ప్రముఖ మాత రిసర్చ్ ఆఫ్ ఆయుర్వేద వైద్యాలయ సీనియర్ వైద్యులు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 2 గంటల వరకు పివి కాలనీ, సిఈఆర్ క్లబ్ నందు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ వైద్య శిబిరం నందు అనేక రకాల వ్యాధుల నివారణకు ఆయుర్వేద మందులు ఇవ్వనున్నారు. కావున, మణుగూరు ఏరియా సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవలసి నదిగా అధికార ప్రతినిధి, డిజిఎం (పర్సనల్)



ఎస్ రమేశ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం.

**- కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జిల్లా నాయకులు రేసు బుచ్చిరెడ్డి.**

సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 20: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేసు బుచ్చిరెడ్డి కాంచన పెల్లి గ్రామం,మీడియాతో మాట్లాడుతూ.



దశబ్దాలుగా సుదీర్ఘమైన డిమాండ్లను పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణనను అసెంబ్లీలో ఆమోదం తెలిపిన మంత్రి వర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతూ, మాదిగ జాతి సోదరుల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ ఒకవైపు, బీసీలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు బీసీ కులగణన మరోవైపు నిర్వహించి.. సామా జిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువు చేసిందన్నారు. ఎస్సీ వర్గీ కరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించగానే తెలంగాణ ప్రభుత్వం ఏక సభ్య కమీషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయించి అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని వివరిం చారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందుకు తగినట్లుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటూ బలహీనవర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.. అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని మీడియాతో మాట్లాడినారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం.

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్.**

సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 20. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాసు నర్సాయిగూడెం గ్రామం,మీడియాతో మాట్లాడుతూ.

దశబ్దాలుగా సుదీర్ఘమైన డిమాండ్లను పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణనను అసెంబ్లీలో ఆమోదం తెలిపిన మంత్రి వర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతూ, మాదిగ జాతి సోదరుల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ ఒకవైపు, బీసీలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు బీసీ కులగణన మరోవైపు నిర్వహించి.. సామా జిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువు చేసిందన్నారు. ఎస్సీ వర్గీ కరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించగానే తెలంగాణ ప్రభుత్వం ఏక సభ్య కమీషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయించి అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని వివరిం చారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందుకు తగినట్లుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటూ బలహీనవర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం



నిలబెట్టుకుందన్నారు.. అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని మీడియాతో మాట్లాడినారు.

# తాను నాయక్ కు ఘనంగా నివాళులు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో జాటోత్ తాను వర్ధంతి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు వారు ఈ కార్యక్రమానికి ఉద్దేశించి మాట్లాడుతూ జటోత్ తాను నాయక్ 75వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు లంబాడ మహా పోరాట యోధుడు జాటోత్ తాను నాయక్ 1950 మార్చి 20 న ముంద్రాయి దొర గుండాలతో పోరాడుతూ వీరమరణం చెందాడని అన్నారు నిజాం ప్రభుత్వం హెూం డిపార్ట్మెంట్ నివేదికలు పరిశీలిస్తే అనేక ఆశ్చర్యకరమైన విషయాలు ఆనాడు తెలిశాయని అన్నారు కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ కు రాకముందే తాను నాయక్ కుటుంబం దొరలను ఎదిరించి భూములపై తమ హక్కులను సాధించుకున్నారని అన్నారు తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేసింది తాను నాయక్ కుటుంబమేనని అన్నారు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం విసునూరు దేశ్ముఖ్ గుండాలను నిజాం రజాకారులను ఎదిరించిన ధైర్యశాలి తాను నాయక అని అన్నారు ఇలా అనేక పోరాటాలు చేస్తూ ఉంటే ఆయన ఆచూకీ కోసం అనేకమంది ద్రోహులను రజాకారులు నియమించుకున్నారు చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో మొంద్రాయికి సమీపంలో నున్న నీలి బండ తండాలో తాను నాయక్ అతని ఉద్యమ సహచరుడుని పోలీసులు పట్టుకొని మొంద్రాయి భూస్వాముల గడిలో ఒక బండి చక్రానికి కట్టేసి అతి కిరాతకంగా హింసించి చంపుతుంటే ప్రజలు కన్నీరు మున్నీరయ్యి అన్నారు ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్ జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు బట్టు హుస్సేన్ నాయక్ సంపత్ నాయక్ సీతారాం నాయక్ హుస్సేన్ నాయక్ కిషన్ నాయక్ రవి నాయక్ హర్సింగ్ నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# అశ్రునయనాలతో మాజీ వైస్ ఎంపీపీ ప్రసాద్ కు అంతిమ వీడ్కోలు

- గత స్మృతులు తలుస్తూ, కన్నీటి పర్వంతమైన ఎమ్మెల్యే దంపతులు.
- పాడెమోసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, వెంట కదిలిన కాంగ్రెస్ శ్రేణులు.



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి. (వెంకటేష్)మార్చి 20:టేకులపల్లి-కొత్తగూడెం హైవే రహదారిలోని బోరింగ్ తండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందిన టేకులపల్లి మాజీ వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ కు గురువారం సులానగర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వీరాభిమాని ఉండేటి ప్రసాద్ కావడంతో అంతిమయాత్రలో ఎమ్మెల్యే కనకయ్య కుటుంబ సభ్యులతో పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. గత ముప్పై ఏళ్లుగా కోరం కుటుంబ సభ్యులతో మృతునికి గల అవినాభావ సంబంధాన్ని గుర్తుచేసుకుని దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతిమయాత్రకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరాగా, ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళులర్పించి స్వయంగా పాడే మోశారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందు క్రాస్ రోడ్డు లో థాను నాయక్ విగ్రహం పెట్టాలి...

- రమేష్ రాథోడ్,
- జాటోత్ థాను నాయక్ జంక్షన్ గా నామకరణం చేయాలి,
- గుగులోత్ భద్రు నాయక్..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 20,**పాల్వంచ పట్టణ పరిధిలో మైనింగ్ కాలేజ్ ఎదురుగా జాటోత్ థాను నాయక్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో కు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాటోతు థాను నాయక్ తెలంగాణ గిరిజన ఉద్యమ నాయకుడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిష్టు పార్టీకి నాయకత్వం వహించిన యుద్ధ వీరుడుఅనీ రమేష్ రాథోడ్ పేర్కొన్నారు.భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం విసునూరు దేశ్ ముఖ్ గుండాలను నిజాం రజాకార్లను ఎదురించిన ధైర్యశాలి. ధర్మాపూర్ తండా పోరు గడ్డను దాస్య శృంఖలాలు నుండి విముక్తి చేసి అమరుడైన బంజారా కొదమ సింహంఅనీ అందుకు గిరిజన జనాభా ఎక్కువ ఉన్నా ఈ ప్రాంతం లో (ఇల్లందు క్రాస్ )థాను నాయక్ జంక్షన్ మార్చాలని స్థానిక ఏమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలనీ కోరారు.ఈ కార్యక్రమం లో , ధర్మాసోత్ ఉపేందర్, అనిల్ ఇస్లావత్, రామకృష్ణ మాలోత్, చందు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.......

20 వ.శతాబ్దం భారత దేశచరిత్రలో వీరత్వంలో త్యాగంలోతెలంగాణ రైతాంగ పోరాటానికి మరేదీ సాటి రాదు.ఈ ఉద్యమం. హైదరాబాద్ సంస్థానం లోని తెలంగాణ ప్రాంతంలో 1941 నుండి 1951 వరకు దాదాపు పది సంవత్సరాలు వరంగల్ జిల్లాలో జనగామ తాలూకా కేంద్రంగా తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. జనగామ జమిందార్ విసునూరు రామచంద్రరెడ్డి కొడుకు బాబుదొర ఒక రోజు గుండాలతో తాండకు వచ్చి తాండ గుడిసెలను నిప్పు పెట్టి అగ్నికి ఆహుతి చేసినారు.థానునాయక్ అన్న సోమ్లా నాయక్ అతనితో సహా మొత్తం ఐదుగు రిని గుండాల సహాయంతో మండుతున్న అగ్నిలో సజీవదహనం చేసి వెళ్ళిపోయారు కొన్ని రోజుల తర్వాత మళ్ళీ బాబుదొర తాండా ప్రజలను హింసించడం మొదలుపెట్టాడు.గుండాలతో రజాకార్ల తో మధ్యాహ్నం సమయంలో తాండలో థాను నాయక్ వదినమ్మ జాటోత్ ఫూలిబాయి అందరికి రహస్య సమాచారం ఇచ్చి తాండ వాసులను పిలపించి అందరినీ ఏకం చేసి ఆడవాళ్ళు కారం పొడితో మగవాళ్ళు వడెసరాళ్ల, వడెసతో దొరల గుండాల పై తిరుగుబాటు ప్రారంభించారు మాట్లాడుతూఅనీ కొనియాడారు. ఈ సందర్భంగా ధర్మాసోత్ ఉపేందర్ నాయక్ మాట్లాడుతూ జాటోత్ థానూ నాయక్ గిరిజన తెగకు చెందిన నిరక్షరాస్యుడు. చాలా తెలివి తేటలు గలవాడు. అతని తెలివి తేటలను గమనించి కమ్యూనిస్టు నాయకులు థాను నాయక్ కుటుంబానికి అండగా నిలిచారు. దొరలు, రజాకార్ల పెత్తనాన్ని, ధైర్యంగా ఎదిరించి పోరాడేవాడు అనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అనిల్ ఇస్లావత్, రామకృష్ణ మాలోత్, చందు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు

## పేదలు, కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ.

- పోడు భూముల పట్టాలకోసం మరో ఉద్యమం చేపడదాం.
- వలస ఆదివాసులకు అండగా ఉంటాం.
- పాల్వంచ ప్రాంత సమగ్రాభివృద్ధిపై ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక శ్రద్ధ.
- ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో చిరతానిపాడుగుంపు లో మౌలిక వసతుల కలపనకు కృషి చేస్తాం.
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం.
- చిరతాని పాడుగుంపు సీపీఐ శాఖ మహాసభ విజయవంతం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 20,**
పాల్వంచ(రూరల్): పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉలవనూర్ బంజర పంచాయితీ చిరతానిపాడుగుంపు సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వనాథం మాట్లాడుతూ నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిస్కారంకోసం, పార్టీ పటిష్ఠత కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులందరికీ పట్టాలు అందించి రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి, నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ గ్రామాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి పంచాయతీలో సిపిఐకు ప్రాతినిధ్యం వచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, మండల నాయకులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, అమృత్తరావు, బాలాజీ, రేగు కృష్ణ, బాలు స్వర్ణలత రమణ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.
సభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. చిరతానిపాడుగుంపు శాఖ కార్యదర్శిగా మాడే చుక్కారావ్, సహాయ కార్యదర్శిగా సురేష్ లను ఏకగ్రీవంగా ఏనుకున్నారు

## కలకోడిమ గ్రామంలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ నాయకులు వడ్డే రామారావు..



**తల్లాడ, మార్చి 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
తల్లాడ మండలంలోని కలకోడిమ గ్రామంలో సీసీ రోడ్డుకు కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు వడ్డే రామారావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృషితో సిసి రోడ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈజీఎస్ నిధులు 30 లక్షలు మంజూరు కావడంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆదూరి దాసు రావు, సెక్రెటరీ ప్రశాంత్, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి మాలతి నివాళులర్పించిన దుండేటి వీరారెడ్డి,



**తల్లాడ మార్చి 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ మండలం బిల్లుపాడు (వెంకటగిరి) గ్రామస్తులు నల్లమోతు మాలతి ఎక్స్ ఎంపీటీసీ ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయం విధితమే. వారి దశదిన ఖమ్మం లోని మమత రోడ్డులో గల ఈ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ మారెళ్ళ మల్లికార్జునరావు,
గోవింద శ్రీను, జోసెఫ్, సామినేని రామ్ అప్పారావు, వేముల గోవిందు,
హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులందరికీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**తల్లాడ మార్చి 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ మండలం బిల్లుపాడు (వెంకటగిరి) గ్రామస్తులు నల్లమోతు మాలతి మాజీ ఎంపీటీసీ ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయం విధితమే. వారి దశదిన కార్యక్రమం గురువారం ఖమ్మం లోని మమత రోడ్డులో గల ఈ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు ఈ కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ గారు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులందరికీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ గారు, దీవెల వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్ కుమార్, భూక్య అంజయ్య, ఇసినేపల్లి వెంకటేశ్వర్లు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాలతీకి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు రాయల రాము, తుమ్మలపల్లి రమేష్..



**తల్లాడ మార్చి 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటీసీ నల్లమోతు మాలతి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఖమ్మంలో ఆమె దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు రాయల రాము, తుమ్మలపల్లి రమేష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళు లర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీవెల కృష్ణయ్య, ఐనాల నరసింహారావు, ఆ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో

**పూర్ణ మార్కెట్, రామకృష్ణ రైతు బజార్ మార్కెట్ ఆసీలు వసూలు చేసే నిమిత్తం**



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** జోనల్ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో జోన్ -4 పరిధిలో ఉన్న మార్కెట్లు అయినా పూర్ణ మార్కెట్, రామకృష్ణ రైతు బజార్ మార్కెట్ ఆసీలు వసూలు చేసే నిమిత్తం సంవత్సర కాలానికి అనగా ఏప్రిల్ 2025 నుండి 2026 మార్చ్ నెల వరకు సంవత్సర కాలానికి వేలంపాట నిర్వహించడం జరిగింది. పూర్ణ మార్కెట్ ఆశీలు వసూలు నిమిత్తం 81,10,000/- బొత్స శీను, మరియు రామకృష్ణ రైతు బజార్ మార్కెట్ 19,50,000/- ఎస్ విజయ్ కుమార్ పాడడం జరిగింది. ఈ వేలంపాటలో రెవిన్యూ ఆఫీసర్ అప్పలరాజు, జోనల్ సూపర్డెంట్ చంద్రశేఖర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సీతారాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఎండిఓ కి వినతి

**తల్లాడ మార్చి 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ మండలం, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఎండిఓ కి వినతి పత్రం గురువారం గ్రామపంచాయతీ కార్మికులు అందించారు.
ఎన్నో సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క కార్మికుడికి ప్రతి నెల జీతం అందే విధంగా చూడాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు ఇప్పించాలని, పంచాయతీ కార్మికుడు చనిపోతే, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎవరికైనా లైసెన్స్ లేకపోతే వారికి ట్రాక్టర్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని, ఈఎస్ఐ, పి. యఫ్ సౌకర్యం కల్పించాలని, వినతిపత్రం ఇచ్చారు. , మా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎండిఓ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు. ఇమ్మడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు, బొగ్గుల కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, లాజరు, వెంకటేశ్వర్లు, కృష్ణ, దాసు, రవి, నారాయణ, వీరాంజనేయులు, మురళి, ప్రభాకర్, బుజ్జి, ఆరోను, రాంబాబు మిగతా పంచాయతీ కార్మికులందరూ పాల్గొన్నారు.



## హ్యాపీగా పరీక్షలు రాయాలి

**సంఘ సేవకుడు, అయిత పరంజ్యోతి**



**మార్చ్ 20 (సీ కే న్యూస్) చేగుంట :** తెలంగాణ రాష్ట్రంలో చదివే పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి భయం లేకుండా, సమయస్పూర్తితో పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని చేగుంట పట్టణ ప్రముఖ సంఘ సేవకుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి పేర్కొన్నారు, ఈ సందర్భంగా పట్టణ కేంద్రం లో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం, పాఠశాల తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటదన్నరు తరగతి గదిలో సంవత్సరం అంత చదివిన విషయాన్ని సమయస్ఫూర్తితో పరీక్ష హాల్లో ప్రజెంటేషన్ చేయడం మీ ముందున్న కర్తవ్యం అని అన్నారు, కష్టపడి పరీక్షల్లో మంచిగా రాసి మీ తల్లిదండ్రులను, గురువులను, పట్టణాన్ని జిల్లా లో, రాష్ట్రంలో మంచి పేరు తేవాలని, అలాగే జిపిఎస్ 10 వచ్చిన వారికి తన వంతు సహకారంగా ప్రతి విద్యార్థికి 5000 రూపాయలు నగదు బహుమానం ఇస్తానని అన్నారు

## నారా చంద్రబాబునాయుడు ని కలిసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**నియోజకవర్గ అభివృద్ధి పై సిఎం తో చర్చించిన ఎమ్మెల్యే**
**నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి**
**నియోజకవర్గ అబివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తామని హామీ**



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని సీఎం చాంబర్ లో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కలిశారు. దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించిలని కోరుతూ సీఎం తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి తో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కాసేపు చర్చించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని , నియోజకవర్గంలో పరిష్కారం కాని సమస్యలు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సిఎం సానుకూలంగా స్పందించి తమవంతు సహాయ సహకారం ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## దుకాణ యజమానుదారుల రోడ్లపై చెత్తలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మార్చి 20 : జోన్ -4 జోనల్ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు 35 వ వార్డులో గల పూర్ణ మార్కెట్, పందెం పుల్లల సందు, దుర్గాలమ్మ గుడి, బౌదర రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించడం జరిగింది. ఈ పర్యటనలో ముఖ్యంగా దుకాణ యజమానుదారుల రోడ్లపై చెత్తలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని%ఎ% సూచించారు.
ఈ పర్యటనలో సానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు అనంతరం 31 వ వార్డులో పుతివారి మన్యం, భీమ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పి 4 సర్వే సంబంధించి, స్వర్ణాంధ్ర ఫీడ్బ్యాక్ సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ పర్యటనలో సచివాలయ సెక్రటరీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మనకు ఉపయోగం పడని వస్తువులు ఇతరుల అవసరాలకు అందించాలి....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సహాయం చేయాలనుకున్న వారికి మంచి ప్లాట్ ఫాం వాల్ ఆఫ్ కైండ్ నెస్
- మీకు అవసరమైనది తీసుకోండి, అవసరం లేనిది వదిలేయండి
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ ర్యాక్ లకు సేవా చేసే అవకాశంగా వాడుకుందాం
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మార్చి -20:మన ఇంట్లో మనకు అవసరం లేని వస్తువులు ఇతరులకు ఉపయోగ పడవచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఆసుపత్రి ఎదురుగా వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడను అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైన్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వాల్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమం క్రింద జిల్లా ప్రధాన ఆసుపత్రికి ఎదురుగా ఉన్న గోడ వద్ద ప్రజలు తమ ఇంట్లో అవసరం లేని వస్తువులు, పాత సామాన్లు, బట్టలు వదిలితే అవి అవసరం ఉన్నవారు తీసుకొని వెళ్తారని తెలిపారు.
శుభ్రంగా ఉపయోగించదగిన, పాడైపోని దుస్తులు, బూట్లు, పుస్తకాలు, పాత్రలు, ఏదైనా ఇతర వస్తువులను వదిలి వేయాలని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ వద్ద ఎట్టి పరిస్థితుల్లో ఆహార పదార్థాలు వదిలివేయొద్దని కలెక్టర్ తెలిపారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ దగ్గర వస్తువులను వాటికి ఏర్పాటు చేసిన సెల్ఫ్ లలో ఉంచాలని, తద్వారా అవసరమైన వారు వాటిని సులభంగా కనుగొనవచ్చు అని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వస్తువులను నేలపై విసిరేయడం, వదిలేయడం వంటివి చేయవద్దని అన్నారు. దయచేసి మీకు అవసరమైనది తీసుకోండి అని, అవసరం లేనిది వదిలేయండి అనే నినాదంతో వాల్ ఆఫ్ కైండ్ నెస్ పని చేస్తుందని అన్నారు. దయ యొక్క గోడ వద్ద ఉన్న వస్తువులను ఎవరైనా వారి అవసరం మేరకు తీసుకొని వెళ్ళవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగితే అన్ని రంగాలలో సమానత్వం సాధిస్తారు...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మహిళలు ప్రతి రూపాయిని ఆదాయం పెంచే కార్యక్రమాలకు ఉపమోగించుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి
- వ్యాపారవేత్త ఆలోచనా ధోరణితో మహిళలు ముందుకు సాగాలి
- పెనుబల్లి మండలలో నడుస్తున్న మహిళా శక్తి యూనిట్లలను పరిశీలించి, మండల మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మార్చి -20:సమాజంలో సమానత్వం రావాలంటే మహిళలు అన్ని రంగాలలో నైపుణ్య వ్యాపారం చేస్తూ ఆర్థిక బలం సాధిస్తే సాధ్యమవుతుందని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం పెనుబల్లి మండలంలో కలెక్టర్ పర్యటించారు. పెనుబల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న మండల మహిళా సమాఖ్య భవనంలో ఉషోదయ, ఆదర్శ మహిళా సమాఖ్యలతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ప్రధాన ఎజెండా అంశాలు మహిళా అర్థిక పురోగతి, మహిళా శక్తి యూనిట్ల కార్యకలాపాలు, కొత్త గ్రూపుల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీలు, పొదుపు, కొత్త యూనిట్ల గ్రౌడింగ్, వ్యాపారంలో అభివృద్ధి పలు అంశాలపై సభ్యులతో కలెక్టర్ చర్చించి దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, వ్యాపార రంగంలో నిలదొక్కుకుని అర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటామని స్పష్టం చేశారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అనేక రకాల ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నదని, మహిళల అభివృద్ధి కోసం, ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం, ఉద్యోగ అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మహిళలకు ప్రోత్సహించడమే లక్ష్యంగా మహిళా శక్తి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు.
మహిళలు వ్యాపార నిర్వహణలో పంచసూత్రాలు పొదుపుపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు.
సరియైన సమమంలో పొదుపు, అప్పులు చెల్లింపు, వసూలు, పూర్తి బాద్యతతో పుస్తక నమోదు పాటిస్తూ ధైర్యంగా ముందడుగు వేసి పదిమందికి ఆదర్శంగా ఉండాలన్నారు. మహిళల సమానత్వం మన ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లో ఆడపిల్లలను, మగ పిల్లలను సమానంగా చూడాలని, సమానంగా చదివించాలని సూచించారు. సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని వారిని అన్ని రంగాలలో పురోగమించేలా చేయడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు . మహిళలు అన్ని రంగాలలో పురోగమించడమే అసలైన అభివృద్ధి అన్నారు.
సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని సూచించారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రతి రూపాయిని ఆదాయం పెంచే కార్యక్రమాలకు ఉపమోగించుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకొవాలని సూచించారు.
జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే సూచనలు, అనుభవాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మహిళలకు అవసరమైతే అదనపు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు.
అంతకుముందు కలెక్టర్, పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామంలో ఇందిర మహిళా శక్తి పథకంలో ఎస్.హెచ్.జి. ద్వారా లబ్ధిపొందిన యూనిట్లు బిస్మిల్లా చికెన్ సెంటర్, కూల్ డ్రింక్స్ షాప్, సాయిబాబా కిరాణం ఫాపులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. మహిళా శక్తి యూనిట్ల నిర్వహకురాలు ఫేక్ నాగుర్ బీ, మల్లెల సత్యశ్రీవాణి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వ్యాపారం ఎలా నడుస్తుంది.. ధైర్యంగా ఉన్నారు కదా.. కుటుంబానికి కొంత ఆసరా వచ్చిందా.. ఆర్థిక లావాదేవాలు సరిచూసుకుంటూ ఆదాయం పెంచే మార్గం పై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రయాణంలో సాఫీగా సాగాలంటే ఇంధనం సమకూర్చికొనే బండి డ్రైవర్ మీరే అని.. ఇబ్బందులు ఏమైనా ఉంటే బండిని నెట్టడానికి అధికారులుగా మేము తోడుగా ఉంటామని సరదాగా ఛలోక్తులతో వివరించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డీవో నూరొద్దీన్, అన్నపూర్ణ, లింగాల జ్యోతి, ప్రతాప్, రాధిక , రవీంద్రనాయక్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు....

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఉగాది నుండి రేషన్ కార్డుల క్రింద సన్న బియ్యం సరఫరా**

**పెనుబల్లి, కల్లూరు మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి పొంగులేటి**



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మార్చి -20:
రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 4 లక్షల 50 వేల ఇండ్ల నిర్మాణం చేపట్టి, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల వరకు ఇందిరమ్మ ఇండ్లను కట్టే దిశగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.
గురువారం మంత్రి పెనుబల్లి, కల్లూరు మండలాల్లో పర్యటించి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి, సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు.
పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుని గృహ నిర్మాణానికి, ఎస్టిపి (ఎస్.డి.ఎఫ్.) నిధులు 87 లక్షలతో చేపట్టిన అంతర్గత సి.సి. రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులు కూడా చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.
గతంలో జరిగిన పొరపాట్లను సరి చేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 57 వేల 626 ఉద్యోగాల భర్తీ చేస్తూ నిరుద్యోగులకు నియామక పత్రాలను అందజేశామని అన్నారు.
మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల 450 కోట్లు ఖర్చు చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఉగాది నుంచి సన్న బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు.
దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 20 వేల 676 కోట్ల రైతుల రుణాలను మాఫీ చేశామని, సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందించామని, పండించే ప్రతి ఎకరానికి 12 వేల రైతు భరోసా క్రింద, మొదటి విడత 6 వేల రూపాయలు నెలాఖరులోగా అందరికి అందజేస్తామని అన్నారు.
యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో అద్భుతమైన పథకాన్ని రూపొందించారని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 50 వేల నుంచి 4 లక్షల వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 5 వేల మందికి తగ్గకుండా ఇచ్చేందుకు చర్యలు తీసుకొని, దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు.
పేదలకు 4 విడతలలో ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సహాయం అందుతుందని, ఫౌండేషన్ వేసిన తర్వాత లక్ష రూపాయలు, కిటికిలు లెవల్ తర్వాత లక్ష పాతిక వేలు, స్లాబ్ దశ చేరిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు, ఇండ్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయల మొత్తం ఐదు లక్షల సహాయం పేదలకు ఇంటి కోసం అందుతుందని అన్నారు.
పైలెట్ గ్రామంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులు కూడా పరిశీలించి వారికి కూడా ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. స్థానికంగా ఉన్న అటవీ భూముల వివాదాలను రాబోయే 20 రోజుల్లో పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సీతారామ ప్రాజెక్టు కాల్వల క్రింద తూము నిర్మించి రామచంద్రాపురం, ఎరుగట్ల గ్రామాల చెరువు నింపేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.
కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలతో ప్రత్యేకంగా స్త్రీ టీ క్యాంటీన్ లను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో 4 వేల వరకు వివిధ వ్యాపార యూనిట్లను మహిళలచే ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 2 పెట్రోల్ పంప్ లను మహిళా సంఘాలు నిర్వహించేలా ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు.
పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీరుస్తూ ప్రభుత్వం నూతనంగా ఉపాధ్యాయులను భర్తీ చేయడం జరిగిందని, నాణ్యమైన విద్య పిల్లలకు ఉచితంగా అందేలా పని చేస్తున్నామని, ఏ.ఐ మాధ్యమం, కంప్యూటర్ విద్య, ఆంగ్ల భాష పరిజ్ఞానం విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు.
సబ్ సెంటర్ నుంచి జిల్లా ఆసుపత్రి వరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రైవేట్ వైద్యం అవసరం రాకుండా ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు.
పేదల అభివృద్ధికి సొంత ఇండ్లు ఉండటం చాలా అవసరమని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసిన గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత ఇందులో నుంచి వచ్చిన అనుభవాలను వినియోగిస్తూ ఇతర ప్రాంతాల్లో కూడా పనులు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.
అనంతరం మంత్రి, కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామంలో 95 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, డి.ఎం.ఎఫ్.టి నిధులు 25 లక్షలతో నిర్మించిన లైబ్రరీ, రీడింగ్ హాల్ ను ప్రారంభించారు. కల్లూరు మండలం యర్రబోయినపల్లి గ్రామంలో సి.ఆర్.ఆర్. నిధులు ఒక కోటి 77.50 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఎఫ్ఆర్వో పి. స్నేహాలత, తహశీల్దార్లు జి. ప్రతాప్, సాంబశివుడు, ఎంపిడివో లు అన్నపూర్ణ, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు...



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పన
- 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 344 కేంద్రాల ఏర్పాటు
- రబీ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మార్చి -20:రబీ మార్కెటింగ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి 2024-25 రబీధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీ సీజన్ కు సంబంధించి లక్షా 85 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 73 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, మొత్తం 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. గత సీజన్ లో ధాన్యం రవాణా అంశంలో ఎక్కడైనా చిన్న, చిన్న ఇబ్బందులు వస్తే వాటిని పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఉండాలని కలెక్టర్ తెలిపారు.
ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. దాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.
ప్రాథమిక అంచనా ప్రకారం ఏప్రిల్ రెండవ వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభమవు తాయని, జిల్లాలో వరి పంట కోతల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకుని వచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలని, కొనుగోలులో ఎక్కడా ఒత్తిడి లేకుండా క్రమ పద్ధతిలో ధాన్యం తీసుకుని వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రం మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ అన్నారు.
జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి మనకు సన్న రకం వడ్లు రాకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, మొదలగు వసతులు కల్పించాలని అన్నారు.
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకేట్లు పెట్టుకోవాలని అన్నారు.
కొనుగోలు సమయంలో రైతులకు వడదెబ్బ తగిలే అవకాశాలను నివారించాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. వేయింగ్, తేమ యంత్రాల పని తీరును చెక్ చేసి సర్టిఫై చేయాలని అన్నారు.
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్ఫాలిన కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఉన్న గన్ని బ్యాగుల వివరాలను నోటీసు బోర్డుపై రాయాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు ఉండేలా చూడాలని అన్నారు.
ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.